## క్లుప్తంగా

### వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



నగదును బేబికి అందజేస్తున్న సహచరులు

గూడూరురూరల్ : మండలంలోని తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన ఈదూరు బేబి ఆటో ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఇంటి వద్దే ఉంటోంది. దీంతో ఈ విషయం తెలుసుకున్న చెన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1981–1986లో చదువుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి, ఎం.రవిచంద్రారెడ్డి, ఎ.రాధాకృష్ణారెడ్డి, ఇ.ధనుంజయరెడ్డి, అల్లి రమేష్‌బాబు, ఎం.కమలాకర్‌రెడ్డి, మిత్ర బృందం కలసి ఆదివారం తిప్పవరప్పాడులో బేబి నివాసానికి వెళ్లి రూ.75వేలు నగదును అందజేశారు.

### ఫల సరుకుల పంపిణీ



ఫలసరుకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరురూరల్ : పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం దసరా పండుగను పురస్కరించుకుని నిరుపేదలకు నెలకు సరిపడా 18 రకాల ఫల సరుకులను పాణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు పాణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ లైఫ్ టైం ప్రాజెక్ట్‌గా ప్రగతి సేవా సంస్థ ద్వారా తండ్రి జ్ఞాపకార్థం మల్లికార్జునరెడ్డి నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయుడు రాధయ్య, రాము, కుమార్ నాయుడు, నాగరాజు, డీపీఎంసీ సభ్యులు వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి పెంచలయ్య, మునిప్రసాద్ పాల్గొన్నారు.

### రోడ్డు ధ్వంసం



ఏరూరు పొలిమేరల్లో ధ్వంసమైన వరగలి రోడ్డు

చిల్లకూరు : మండలంలోని చిల్లకూరు వరగలి క్రాస్ రోడ్డు నుంచి సుమారు 32 కీమీ దూరంలోని గుమ్మళ్ల దిబ్బ వరకు సుమారు 35 గ్రామాల ప్రజలు రాక పోకలు సాగించే రోడ్డు ధ్వంసమైంది. మట్టి, గ్రావెల్‌ను తరలించే వందలాది టిప్పర్లు రాకపోకలు సాగించడంతో పాత రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల ఈ ఆరోడ్డుకు మరమ్మతులు తూతూమంత్రగా చేయడంతో మళ్లీ రాళ్లు తేలి గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో ఆర్టీసీ అధికారులు గుమ్మళ్ళదిబ్బకు గతంలో మూడు బస్సు సర్వీస్‌లు నడుపుతుండగా నేడు ఒక్క సర్వీస్‌కు కుదించేశారు. రోడ్డు బాగు పడే వరకు నడపలేమని అధికారులు చెబుతున్నారు. ఈరోడ్డు ను బాగు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### నిశ్చితార్థంలో నేదురుమల్లి



నూతన వధూవరులతో రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: పట్టణానికి చెందిన నూతన వధూవరులు వైఎస్సార్‌సీపీ నాయకులు తాండవ మునిసాయి రెడ్డి, ఇలీషాను వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆశీర్వదించారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో వద్ద ఉన్న ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన నిశ్చితార్థంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు.

### చికెన్ ధరలు 29-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | | |
|---|---|---|
| బ్రాయిలర్ లైవ్ | : | 118 |
| లేయర్ లైవ్ | : | 110 |
| బ్రాయిలర్ చికెన్ | : | 214 |
| బ్రాయిలర్ స్కిన్ లెస్ | : | 236 |
| లేయర్ చికెన్ | : | 187 |

చలివేంద్రం రోడ్డు సమీపంలో పంట కాలువలను ఆక్రమించి వేసిన వెంచర్



మేనకూరు గ్రామ సమీపంలో పంట కాలువను ఆక్రమించి వేసిన లేవుట్



# పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు



మేనకూరులో అనుమతులు లేకుండా వేసిన లేవుట్

- మేనకూరు సెజ్ పరిధిలో వెలుస్తున్న వెంచర్లు
- పంట కాలువలు, గ్రామ నత్త భూముల దురాక్రమణ
- కూటమి నాయకుల అండతో రియల్టర్ల ఆక్రమణలు

నాయుడుపేటటౌన్: దినాదినాభిగా వృద్ధి చెందెతున్న మేనకూరులో సెజ్ (పరిశ్రమల కేంద్రం)లో ఇష్టారాజ్యంగా అక్రమ లేవుట్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. పంచాయతీ అనుమతులు సైతం లేకుండా ప్రభుత్వానికి ఎటువంటి రియల్టీలు చెల్లించకుండా దర్జాగా అక్రమ లే అవుట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మేనకూరు పరిశ్రమల కేంద్రంలో భూములు కోట్లు విలువ పలుకుతుండడంతో పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూములు, గ్రామ నత్త భూములు, పంట కాలువలను సైతం ఆక్రమించుకుంటున్నారు. ముఖ్యంగా మేనకూరు పంచాయతీ పరిధిలోని కోనేటి రాజుపాళెం గ్రామం మొదలుకొని ఎన్‌టీఆర్ కాలనీ, మేనకూరు వద్ద భీమవరం రోడ్డు, మామిడికాలువ, నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ కాలనీ, చలివేంద్ర, వద్దిగుంట కండ్రిగ, తిమ్మాజి కండ్రిగ గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా పంట కాలువలు, ప్రభుత్వ భూములు ఆక్రమించేశారు. వాటిల్లో సుమారు 15కు పైగా అక్రమ లేవుట్ల ఏర్పాటు చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్‌ల విక్రయించేస్తున్నారు. మేనకూరు సెజ్ పరిధిలో పలు చోట్ల ప్రభుత్వ భూముల్లో భారీ భవంతులు సైతం నిర్మాణాలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో గ్రామస్తులు నిస్తేజంగా ఉండిపోతున్నారు. ఆక్రమణలపై పలుమారు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. కూటమి నేతల అండదండలతో రియల్టర్లు ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ భూములు, పంట కాలువలు ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకుంటాం**

మేనకూరు పంచాయతీ పరిధిలో ఇరిగేషన్‌కు సంబంధించి పంట కాలువలు తదితర వాటిని ఏఈలతో కలిసి పరిశీలించి చర్యలు చేపడతాం. ఇరిగేషన్ శాఖకు సంబంధించి స్థలాలు ఆక్రమణలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

విశ్వనాథ్, ఇరిగేషన్ డీఈఈ, గూడూరు

**ఫిర్యాదులు వచ్చాయి**

మేనకూరు పంచాయతీ పరిధిలో ప్రభుతం భూముల ఆక్రమణలను పరిశీలించి చర్యలు చేపడతాం. పలు చోట్ల పంట కాలువలు తదితర వాటిని ఆక్రమించినట్లు ఫిర్యాదులు అందాయి. ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలిస్తాం. ఆక్రమణల గుర్తించి చర్యలు చేపడుతాం.



- మాగర్ల రాజేంద్ర, తహసీల్దార్, నాయుడుపేట

**అధికారుల ఆదేశాలు బేఖాతర్**

మేనకూరు పంచాయతీ పరిధిలో అనుతులు లేకుండా పలు లే అవుట్లు వేస్తున్నారు. పంచాయతీ అధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయడం లేదు. కేవలం మూడింటికి మాత్ర మే అనుమతులు ఉన్నాయి. అన్ని లేవుట్ల సర్వే నంబర్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపడతాం.

- ఎం అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, మేనకూరు

### వైఎస్సార్ డిజిటల్ బుక్ స్కానర్ ఆవిష్కరణ నేడు

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలకు భరోసా ఇచ్చే దిశగా పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవంలో సోమవారం ఉదయం వైఎస్సార్ జిడిటల్ బుక్ స్కానర్ ఆవిష్కరించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చింది.

### కండలేరులో 56.730టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.090 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,400 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

### శిథిలావస్థలో సంపద తయారీ కేంద్రం



శిథిలావస్థకు చేరిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

దొరవారిసత్రం: పంచాయతీ కేంద్రమైన శ్రీధనమల్లికి చెందిన చెత్త సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు కానీ, పాలకులు కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. సంపద తయారీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో పాటు చెత్త సేకరించే బండ్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని దుస్థితి నెలకొంది.

## ఆందోళన పడొద్దు.. అండగా ఉంటా



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: కూటమి ప్రభుత్వం నాయకులు చేస్తున్న అరాచకాలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఆదివారం నియోజవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధిని మరచి కక్ష సాధింపు చర్యలకే పాల్పడుతున్నట్లు విమర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు ఆరోపించారు. తమ నేతలు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పరిపాలన పట్ల రాష్ట్రంలో ఇప్పటికే వ్యతిరేకత పెరిగిపోయిందని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని కార్యకర్తలు నాయకులతో స్థానిక రాజకీయ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, అనుబంధ విభాగాల అధ్యక్షులు సదానందరెడ్డి, ములవాయిల వెంకటేశ్వర్లు, నాయకులు పుజారి శ్రీనివాసులు, కందాటి రాజారెడ్డి, కూనా మల్లికార్జున్, కె ప్రసాద్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

## ఆగని అక్రమ తవ్వకాలు



స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో లారీలకు లోడింగ్

పెళ్లకూరు: తాగు, సాగునీటికి జీవనాధారమైన స్వర్ణముఖినదిలో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని కలవకూరు గ్రామ సమీపంలో ఉన్న స్వర్ణముఖినదిలో నిబంధనల ప్రకారం కూలీలతో ఇసుక తవ్వి కేవలం భవన నిర్మాణపు పనులకు మాత్రమే తరలించాలి. కానీ అనుమతులు పొందిన కాంట్రాక్టర్ ఏకంగా స్వర్ణముఖినదిలో యంత్రాలు పెట్టి సుమారు 10 నుంచి 15అడుగుల లోతు వరకు ఇసుక తవ్వకాలు చేపట్టి లారీలకు లోడింగ్ చేసుకొని దూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, చింతపూడి తదితర గ్రామాల్లో ఉన్న రైతులందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలతో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు నిల్వ ఉండే పరిస్థితి లేకపోవడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## బురదగల్లి రోడ్డు బురదమయం



రొచ్చురొచ్చుగా ఉన్న బురదగల్లికి వెళ్లే రోడ్డు



గుంతలు పడి బురదగుంటగా మారిన కుమ్మరిపాళెం రోడ్డు

చిట్టమూరు: మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామం బురదగల్లి కొత్తపాళెం రోడ్డు బురదమయంగా మారింది. మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి బురదగల్లి కొత్తపాళెం రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో గ్రామస్తులతో పాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తీర ప్రాంత గ్రామాలైన బురదగల్లి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం, పేరపాటితిప్ప గ్రామాలకు కొత్తగుంట గ్రామం మీదుగా వెళ్లాలి. అయితే కొత్తగుంట నుంచి కొంత దూరం మాత్రమే తారు రోడ్డు వేసి అధికారులు మెటల్ రోడ్డు వేసి వదిలేశారు. దీంతో కంకర పైకి లేచిపోవడంతో వర్షపు నీరు గుంతల్లో చేరి బురదమయంగా మారిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ గ్రామాల నుంచి పట్టణానికి వెళ్లాలంటే గ్రామస్తులు రోడ్డుమార్గం సక్రమంగా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. తడ సెజ్‌లోని శ్రీ సిటీకి ఈ గ్రామాల నుంచి రోజుకు సుమారు 200 మంది ఉద్యోగాలకు వెళుతుంటారు. వారు నిత్యం అవస్థలు పడుతున్నారు. మరో పక్క విద్యార్థుల బాధ వర్ణనాతీతంగా మారింది.

### గుర్రం జాషువాకు నివాళి



గుర్రం జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న అంజయ్య

రాపూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి సందర్భంగా గ్రంథాలయ అధికారి అంజయ్య నిర్వహించారు. ఆయన ఇద్దరి చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

### యువతకు ఆదర్శం భగత్ సింగ్



భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు

గూడూరురూరల్ : బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి భారతదేశ స్వాతంత్ర్యం కోసం యుక్త వయసులోనే ఉరికంబమెక్కి ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ యువతకు ఆదర్శనీయులని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భరతమాతకు దాస్య విముక్తి కలిగించే పోరాటంలో తెల్లవాడి గుండెలను చీల్చిచెండాడిన గొప్ప వీరుడని కొనియాడారు. నేటి పాలకులు స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ ప్రజలను పేదరికంలోకి నెట్టివేసే విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సి.వి.ఎల్, యశ్వంత్, సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, వెంకటేష్, మోహన్, దుర్గా, ప్రశాంత్, సాయి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



ఆక్రమించిన స్థలంలో మట్టిని డంప్ చేస్తున్న ట్రాక్టర్

కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లి నేషనల్ హైవే జంక్షన్ వద్ద సర్వే నెంబర్ 365లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేశారు. అయితే అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ కూటమి నాయకులు ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించారు. ఆదివారం మాదన్నగారిపల్లి వద్ద ఉంజి చౌటపల్లి వాగు పోరంబోకు భూమి నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లతో అక్రమంగా తరలించడం కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిపినా తెలియనట్లు వ్యవహరించడం గమనార్హం.



మట్టిని రవాణా చేస్తున్న ట్రాక్టర్

## శరన్నవరాత్రి వైభవం



చిట్టమూరు : కాళికాదేవి అలంకరణలో కామాక్షమ్మ



రాపూరు : పోతుకోండలో మహాలక్ష్మి అలంకరణలో అంకమ్మతల్లి



రాపూరు : విజయలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మిదేవి



వెంకటగిరి : మహాలక్ష్మి అలంకారంలో కాత్యాయిని



నాయుడుపేట: లలితా త్రిపుర సుందరిగా మూకాంబికా అమ్మవారు



చిల్లకూరు : కాళికాదేవిగా దర్శనమిస్తున్న ముత్యాలమ్మ